


# అనుక్షణం

## - సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో సాధారణ బహుమతి పొందిన నవల

(గతసంచిక తరువాయి)

"**అంత అవసరం వుందా?** ఆ ఫైల్సేంటి?"

"నోట్ల కట్టల మీద పెట్టాను".

'అలానే' అని వాటిని అందుకుని లోపలకు వెళ్లాడు.

మళ్లీ పావుగంట దాకా నిరంజన్ రాలేదు. మనసులో రకరకాల ఆలోచనలు. లెక్క పెట్టిస్తున్నారా? అన్ని రెండు వేల నోట్లు చూసి అనుమానం వచ్చిందా? ఇందులో నకిలీలూ మధ్యలో వున్నాయి అని చెబుతారా?

అతను మళ్లీ రూమ్ లోకి వచ్చాక గాని ఆందోళన తగ్గలేదు.

నిరంజన్ ఓ ప్రింట్ అవుట్ తీసుకు వచ్చాడు. అందులో ఇరవై అయిదు లక్షలు అందాయని, కొత్త వెంచర్ కి చెంది వర్కింగ్ కేపిటల్ లో అది భాగమని, టు పర్సెంట్ ఇంట్రెస్ట్ ఇస్తామని టైప్ చేసి వుంది. అందులోనూ అది స్టాంప్ పేపర్ మీద టైపు చేసుంది. నిరంజన్ కింద సంతకం పెట్టాడు.

"చదివావు కదా. ఏమన్నా అడగాలనుకుంటే అడుగు".

"ఇంట్రెస్ట్ విషయం ఎందుకు నిరంజన్ గారు..."

"ఇది నువ్వు కష్టపడి, కొన్ని సంవత్సరాలుగా సంపాదించుకున్న డబ్బు. కీడెంచి మేలెంచమన్నారు. వ్యాపారం అన్నాక నష్టం కూడా రావచ్చు. ఇంత డబ్బు నువ్వు నన్ను నమ్మి ఇస్తున్నావు. దానికి మినిమమ్ గ్యారంటీ వుండాలి. ఇది ఫైనల్ అనుకోవద్దు. వెంచర్ లో లాభాలు పెట్టుబడి ప్రకారం డిస్ట్రిబ్యూట్ అవుతాయి. నీకు నమ్మకం కలగాలి".

"నమ్మకం లేకపోతే ఎందుకు పెట్టుబడి పెడతాను సర్".

"అది వేరు వెంకీ. ఇది మన మొదటి డీల్. ముందు ముందు మన రిలేషన్ మారుతుంది. మనం ఒకరి నొకరం ఎంతగా నమ్మినా అనుకోనివి జరుగుతుంటాయి. నేను ముందే చెప్పాను. నేను చాలా చిన్న సర్కిల్ ని దగ్గరకు తీసుకుంటాను. నాకు నష్టం వచ్చినా వారికి రాకూడదు అని కోరుకుంటాను. అలాగే వెంచర్ లో కొంత ల్యాండ్ కి సేల్

ఆఫ్ ఎగ్రిమెంట్ రాయించి వుంచుదాం. అది రిజిస్టర్ చేయనవసరం లేదు. ముందు జాగ్రత్తగా వుంటుంది. ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు రిజిస్టర్ చేసుకుంటాం''.

వెంకటాద్రికి తన ఆలోచనలకు తనకు సిగ్గు అనిపించింది.

''మంచిది. నేను బయలుదేరతాను''.

''ఆదివారం అన్నాక ఏదొక కార్యక్రమం పెట్టుకుంటారు. అమ్మాయి, మిసెస్ బయటకు వెళ్లారు. నేను కూడా లంచ్ కి వెళ్లాలి. డ్రైవర్ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాడు''.

''ఎందుకు? నేను వెళ్తాను. మీకు బయటకు వెళ్లాల్సిన పని వుంది కదా''.

''నిన్ను డ్రాప్ చేసి వచ్చాక బయలుదేరి వెళ్తాను'' అన్నాడు నిరంజన్. బయటకు వచ్చాక చాలా రిలీఫ్ గా ఫీలయ్యాడు. ఈ సారి కారులో వెళ్తున్నప్పుడు అనుకున్నాడు. తను ఉద్యోగంలో వున్నప్పుడు ఆఫీసర్లకి కార్లు కొంటానికి లోన్లు యివ్వటం మొదలు పెట్టారు. అప్పట్లో తను జూనియర్ అసిస్టెంట్ నుండి సీనియర్ అసిస్టెంట్ గా ప్రమోట్ అయ్యాడు. వారికి మాత్రం స్కూటర్ లేదా బైక్ తీసుకుంటానికి లోన్లు యిచ్చే వారు. అందుకు రవాణా ఖర్చులు ప్రత్యేకంగా యిచ్చేవారు. కారుకి కొంత ఎక్కువ. కన్వియన్స్ కోసం కార్లు కొని బస్సుల్లో వచ్చేవారు కొందరు!

అప్పుడు అనిపించింది. తనకు కూడా ఏదో రోజు ప్రమోషన్ వస్తుంది. అప్పుడు కారు కొనాలి అని. కళ్యాణితో ఆ మాట అంటే ముందు కారు నడపటం అలవాటు, అదే నేర్చుకోండి అంది. నేర్చుకుందాం అనుకున్నాడు. చాల మంది మిత్రుల దగ్గరో డ్రైవింగ్ స్కూల్స్ నుండి నేర్చుకున్నారు.

ఇద్దరు పిల్లల చదువులు, పెళ్లిళ్లు పెట్టుకుని నాకు కారు అవసరమా అనుకున్నాడు. అంతగా అయితే ఏదొక రోజు ఆదిత్య తనకు కారు కొనిస్తాడు. అప్పుడు డ్రైవర్ని కూడా వాడే పెడతాడు. నాలాంటి అమ్మా నాన్నల కోరికల్ని పిల్లలే తీరుస్తారు అని సరిపెట్టుకున్నాడు. ఇప్పుడు అలా అనిపించటం లేదు. అయిదారు లక్షలు పెట్టి కారు తీసుకుంటే అనే ఆలోచన వస్తోంది. అంతగా అయితే డ్రైవర్ని పెట్టుకోవచ్చు. పది పన్నెండు వేలకి ఎవరో ఒకరు వస్తారు అనుకున్నాడు. అంత డబ్బు పెట్టుబడి పెట్టాలా? ఇది వరకు వేరు. ఇప్పుడింకో పాతిక లక్షలు తన దగ్గరున్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి.

అంతలోనే ఆ ఆలోచనను నెట్టివేశాడు. తన జీవితంలోకి కారు వస్తుంది. అంత వరకు నమ్మకం కలిగింది. అది నిరంజన్ నుండే రావచ్చు. అంత వరకు వేచి వుండటం మంచిది.

ఇంటి దగ్గర కారు ఆగింది.

రెండు రోజులు గడిచిపోయాయి.

అప్పుడు శివకృష్ణ వెంకటాద్రి ఇంటికి వచ్చాడు. అంతకు ముందు టీ.వీ. చూస్తుంటే తాను రోజూ వాకింగ్ కి వెళ్లే చోట శవం కనిపించిందని బ్రేకింగ్ న్యూస్. అది గుర్తు తెలియని శవం. వయసు నలభై సంవత్సరాల లోపు వుంది అంటున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారంట.

అప్పుడే వెంకటాద్రి ఇంటికి వచ్చి వున్నాడు. ఇద్దరూ డాబా మీదకు వెళ్లారు. ఈ రోజు వాకింగ్ కి వెళ్లొద్దా అని అడిగాడు వెంకటాద్రి.

"మనం వెళ్లే ప్రాంతంలో ఓ మర్డర్ జరిగింది" అన్నాడు శివ.

"నిజమా!" అన్నాడు అదిరిపోతూ.

"ఇప్పుడే టీ.వీలో న్యూస్ చూశాను. అందులోనూ ఆ రాళ్ల గుట్టల మధ్య, ఆ ప్రాంతంలో జన సంచారం తక్కువగా వుంటుంది కదా. ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారంట. అందుకని నీకు చెప్పాలని వచ్చాను".

"ఇప్పుడు మనం అటు వెళ్తే మనల్ని కూడా అనుమానిస్తారేమో".

"అలా ఎందుకు జరుగుతుంది?"

"నువ్వు భలేవాడివే. మీరు రోజూ వాకింగ్ కి వస్తుంటారు కదా. ఎప్పుడన్నా ఎవరన్నా తగాదా పడటం చూశారా అని అడగవచ్చు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించారా అనవచ్చు. ఓ సారి ఇంటరాగేషన్ మొదలు పెడితే పోలీసులు ఏమైనా అడుగుతారు. ఇంతకీ ఆ మర్డర్ అయిన వ్యక్తి ఎవరో తెలిసిందా?"

"లేదు. గుర్తు తెలియని శవం అంటున్నారు".

"నా అనుమానం హత్య అక్కడ జరిగి వుండదు. ఎక్కడో చంపి ఏ రాత్రి పూటో ఇక్కడ పారేసి వెళ్లి వుంటారు" అన్నాడు వెంకటాద్రి.

"దర్యాప్తు అయితే కదా ఏ విషయం బయటికి వచ్చేది".

"అవుననుకో" అని ఆలోచిస్తున్నాడు.

"ఈ రోజు మనం అటు వెళ్లటం మానేద్దాం" అన్నాడు శివ.

"ఈ రోజు కాదు. ఇక నుండి ఆ రూట్ లో వాకింగ్ బంద్. అసలు డాబా మీదో, ఇంట్లోనో నడిస్తే చాలని నాకు అనిపిస్తోంది".

"భయపడుతున్నావా?"

"అనవసరంగా తల నొప్పులు ఎందుకు? ఒకే రూట్ లో రోజూ వెళ్లటం మంచిది కాదు. ఎవరో ఒకరు మనల్ని గమనిస్తుంటారు. ఇదేమీ బ్రహ్మానంద రెడ్డి పార్క్ లాంటిది కాదు. ఆ మధ్య అక్కడ కూడా కాల్పులు జరిగాయి అని గందరగోళం జరిగింది కదా!"

"అవును. నాకు గుర్తుంది. ఆ రాళ్లు ఎంత అందంగా వుంటాయి. వాటి గురించి మనం ఎంత భావుకత్వంతో మాట్లాడుకున్నాం. ఆ రాళ్ల మీద కూర్చున్నాం. వాటికి కూడా రక్తపు మరకలు అంటుకున్నాయంటే బాధగా వుంది. అది ఎవరి చావయినా కావచ్చు. ఈ రోజుల్లో మనుషుల ప్రాణాలకు ఏ మాత్రం విలువ లేకుండా పోయింది" అన్నాడు శివ.

"నువ్వు అంటుంటావు కదా. మాఫియాలు అడుగడుగునా వున్నాయని, ఈ మర్డర్ అలాంటిదే అయుంటుంది. మనకు తెలియదు గాని అక్కడ డ్రగ్స్ కూడా చేతులు మారుతుండి వుంటాయి. ఇది కసితో చేసిన మర్డర్ అయివుండదు".

"ఏమో.... ప్రతి మర్డర్ వెనకా ఒకటి డబ్బు. రెండోది స్త్రీ లేదా అక్రమ సంబంధం. ఇంకా నువ్వు అన్నట్లు అసాంఘిక కార్యక్రమాలు వుంటాయి వెంకటాద్రి. ఇందులో ఏదయినా కారణం కావచ్చు. ఆ మధ్య ఓ డ్రైవర్ ధైర్యం చేశాడు. రెండు గోతాల్లో దాచుకున్న డబ్బుని తీసుకుపోయాడు. నెల తిరిగే సరికి అతని శవం ఇలానే దొరికింది. మాఫియాలు అంత త్వరగా దేన్నీ వదలవు అని ఇంతకు ముందు చెప్పాను కదా".

"అవునవును. మనం కొత్తగా డెవలప్ అవుతున్న ఏరియాలకి అద్దె తక్కువని వస్తుంటాం. నాకెందుకో ఈ కాలనీ కూడా సేఫ్ కాదనిపిస్తోంది".

"అలా అంటే నేను ఒప్పుకోను".

"అదేంటి?"

"నగరం నడి బొడ్డులో, అందులోనూ గేటెడ్ కమ్యూనిటీల్లో ఎన్ని మర్డర్లు జరగలేదు. అలా చూసినప్పుడు సేఫ్టీ అనేది ఓ మాయ. నీ పక్కన ఎవరున్నారో నీకు తెలియదు. టెర్రరిస్టు కావచ్చు , చివరికి కొన్ని చోట్ల వ్యభిచారం జరుగుతున్నా పక్కవారికి తెలియదు. ఎప్పుడో బయట పడినప్పుడు నాలుగు రోజులు హడావుడి. మళ్లీ ఎవరి పరుగుల్లో వారు. అందుకని తొందరపడి నిర్ణయాలకు రావద్దు. అయినా నీ జోలికి, నా జోలికి ఎవరు వస్తారు. మన దగ్గర బేవార్సు డబ్బులు మూలుగుతున్నాయా? మనం మామూలు మనుషులం. క్రైమ్ లో మనం భాగం పంచుకోవటం లేదు".

"మన దగ్గర కోట్ల రూపాయలు వుండకపోవచ్చు. వేలు చాలు, ఒకటి రెండు లక్షలు చాలు. అవి మనకు ఎక్కువే" బింకంగా అన్నాడు వెంకూ.

"అందుకేగా ఇప్పుడు అందరూ డబ్బు కంటే డెబిట్, క్రెడిట్ కార్డుల్ని వాడుతున్నారు. నాకయితే ఇదేం పెద్ద వింత కాదు. ఇలా జరుగుతున్నాయి చాలా చోట్ల. మన జాగ్రత్తలో మనం వుండటం మంచిది" అన్నాడు శివకృష్ణ.

"చూద్దాం. నాలుగయిదు రోజుల్లో కొన్ని విషయాలు బయటికి రావచ్చు అనుకుంటాను" అన్నాడు వెంకటాద్రి.

ఇంట్లోకి వచ్చాడు. కళ్యాణి అడిగింది.

"ఈ రోజు వాకింగ్ కి వెళ్లటం లేదా?"

"మేం వాకింగ్ చేసే చోట ఎవర్నో చంపి పారేసారంట" అన్నాడు అప్రయత్నంగానే.

"ఇదెప్పుడు?"

''ఏ ఉదయమో జరిగి వుంటుంది. అంటే ఎవరో పోలీసులకి ఫోన్ చేసి చెప్పుంటారు. ఇంతకు ముందు ఎప్పుడు జరిగిందో తెలియదు. శవాన్ని పోస్ట్ మార్టమ్ చేస్తే గాని వివరాలు తెలియవు. టి.వీలో వార్త చూసి శివ వచ్చి చెప్పాడు. అందుకని ఈ రోజు వాకింగ్ మానుకున్నాం''.

''మంచి పని చేశారు. అయినా ఆ ఏరియాకి మీరు వెళ్తున్నారు గాని, అంత మంచిది కాదని అంటున్నారు''.

''ఎవరన్నారు?''

''పక్కింటి వదినగారు అన్నారు. పగలయితే ఫర్వాలేదు గాని, చీకటి పడ్డాక అలాంటి చోటుకు వెళ్లటం మంచిది కాదంట. అంతే కాదు అక్కడ పాములు తిరుగుతుంటాయి అన్నారు. కొంత కాలం ఆగితే, ఎవరో ఒకరు అపార్టుమెంట్లు కట్టటం మొదలుపెడితే మెల్లగా పది మంది చేరతారు. అప్పుడు ఇలాంటి సమస్యలుండవు''.

''నాకు కూడా మనం ఇల్లు మారితే బాగుంటుందేమో అన్న ఆలోచన వచ్చింది''.

''మీ ఆఫీస్ కి దూరం అవుతుందేమో. ఇంతకు ముందు అపార్ట్ మెంట్ లోనే వున్నాం. మీరు విడిగా వుందాం. నాకు ఇండిపిండెంట్ హౌస్ అంటే ఇష్టం అన్నారు. అందుకని వచ్చాం''.

''అన్నాను. చూస్తుంటే సెక్యూరిటీ ప్రాబ్లమ్ అనిపిస్తోంది. ఈ మధ్య నేను బెంగళూరు వెళ్తున్నాను. నువ్వు ఒక్కదానివే వుండాల్సి వస్తోంది. ప్రతి సారీ పక్కింటి వాళ్లని మీ పాపని పంపించండి అని అడగటం యిబ్బంది కదా''.

''సరే. మీ ఇష్టం. మీరు ఎక్కడకు రమ్మంటే అక్కడికి వస్తాను. మళ్లీ బెంగళూరు ప్రయాణం ఎప్పుడు?'' అంది.

''తెలియదు. ఎప్పుడయినా కావచ్చు'' అని లోపలకి నడిచాడు. అతనికి చిరాకుగా వుంది. ఇప్పటి వరకూ ఆ డబ్బుల గురించి నలిగిపోయాడు. ఏం చేస్తే బాగుంటుందని అనేక తీరులుగా ఆలోచించాడు. చివరికి ధైర్యం చేస్తే ఇదీ పరిస్థితి. అయినా ఈ హత్యలకి తనకీ ఏ సంబంధం లేదు. అది తెలిసినా మనసు వూరుకోదు కదా!

కొన్ని ఆలోచనలు కొన్ని రోజులు వేధిస్తుంటాయి. తర్వాత మనుషులు వాటిని మరిచిపోతారు. ఎప్పుడో ఓ సారి అలాంటివి గుర్తు వస్తుంటాయి. ఇది అలాంటిది కాదు అనుకుంటా. బతికినంత కాలం ఇలా వెంటాడుతూనే వుంటుందా అనుకున్నాడు. ఏమైనా మిగతా డబ్బుని కూడా తొందరగా వదిలించుకోవాలి. అవును. వదిలించుకోవటమే. అదేంటో ఎవరికీ రాని సమస్య తనకి వచ్చింది.

ఏ చదువులూ చదవకుండా అప్పటికప్పుడు రాజకీయాల్లోకి వస్తున్నారు. కోట్లకి కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే పార్టీలు మారుతున్నప్పుడు ఇన్ని కోట్లు చేతులు మారుతున్నాయంటారు. అవన్నీ వాళ్లు మేనేజ్ చేస్తున్నారు. తనకు ఎంతో కొంత ఎకౌంట్స్ తెలుసు. తను ఇంత భయపడటం ఏంటి అనుకున్నాడు.

కళ్యాణి వస్తుందేమోనని చూస్తే రాలేదు.

అందుకని బయటకు కదిలాడు.

గోడ దగ్గర పక్కింటి వారితో మాట్లాడుతోంది.

వెంకటాద్రి ఆగిపోయాడు. వారి మాటలు వినిపిస్తున్నాయి.

"ఇంతకు ముందు ఎప్పుడన్నా ఇట్లాంటి వార్తలు వినేవాళ్ళం. ఆ రోజుల్లో ఎవర్నన్నా చంపారు అని తెలిస్తే అల్లాడిపోయేవారు. ఇప్పుడు మొగుడు–పెళ్లాన్ని చివరకు పెళ్లాలు మొగుళ్లని చంపుతున్నారు. అన్నదమ్ములు, చివరకి తల్లిదండ్రులు పిల్లల్ని, పిల్లల్ని వారూ చంపుకునే పరిస్థితులు వచ్చాయి" అంటోంది పక్కింటావిడ.

"ఇంతకు ముందు మనం ఇంత డబ్బుని చూడలేదు. ఇప్పుడు అలా కాదు కదా. అన్ని చోట్ల నుండి కుప్పలు కుప్పలుగా వచ్చిపడిపోతోంది".

"ఎవరికి పడిపోతుంది వదినగారూ... మీకూ మాకూ అయితే పడిపోవటం లేదుగా. ఈ రోజుకి వంద రూపాయలు ఖర్చు పెట్టాలంటే పది సార్లు ఆలోచిస్తున్నాం. ఇప్పుడు అందరికీ ఇళ్లు కావాలి. మామూలు ఇల్లు కాదు రాచ భవనాలు. కార్లు కావాలి. అవి కూడా ఇంత బారు కార్లు. ఎక్కడ నుంచి వస్తాయి. వాటిని నడపటానికి ఎన్ని రూపాయలు కావాలి. ఇంక ఇంట్లో ఎవరన్నా తింటున్నారా? వారానికి నాలుగు రోజులు బిర్యానీలు కావాలి. అన్ని రకాల మాంసాలు కావాలి. కొత్త ఫోన్లు కావాలి. టీ.వీలు ఒకటా రెండా? ఇంక బట్టల గురించి చెప్పటానికుందా? మరి అంత ఆదాయం ఎవరికుంది? ఇలాంటి వాళ్లు చెడిపోయేది కాకుండా కిందవారిని చెడగొడుతున్నారు. ఏమీ లేని వారు మధ్య తరగతి వారు కూడా ఆకాశానికి నిచ్చెన లేస్తున్నారు. మరి అరాచకం పెరగదా!"

"అవునవును వదినగారూ... ఇంత చేసినా ఆరోగ్యాలు చూసుకుంటున్నారా? ఇంతకు ముందు రోగాలు వేరు. ఇప్పటి రోగాలు వేరు కదా. అయినా అప్పట్లో పల్లెటూరు వుందంటే ఒకరిద్దరు షావుకార్లు వుండేవారు. మోతుబర్లుండేవారు. ఇప్పుడు పట్నాల్లో చూడండి. ఇంక సిటీల్లో అయితే చెప్పటానికి లేదు. వీధికి ఒకరు. వాళ్లకి అప్పులున్నాయో తెలియదు. వెనకటి తరం నుండి ఆస్తులు వచ్చాయో తెలియదు. విచ్చలవిడిగా ఖర్చులు చేస్తున్నారు. అసలు రాత్రికి రాత్రి మనుషులు ఎలా పైకి వస్తున్నారో తెలియటం లేదు".

"అలా రావటం మామూలు మనుషులకి కుదరదు కళ్యాణి గారూ. అప్పట్లో మా దగ్గర ఓ మనిషి గురించి చెప్పుకునేవారు. అందరూ చూస్తుండగా రెండు మూడు బిల్డింగులు కట్టాడు. రెండు కార్లు కొన్నాడు. ఎక్కడ నుంచి వచ్చింది అంత డబ్బు అనుకున్నారు. చివరికి తేలిందేమిటంటే దొంగనోట్లు. ఆ రోజుల్లో లక్షలకు లక్షలు సంపాదించాడు".

"పోలీసులు పట్టుకోలేదా?"

"అదీ జరిగిందనుకున్నారు. అయినా వంద సంపాదిస్తే ఏభై విసురుతాడు. రాజకీయ నాయకుల్ని కొంటే పోలీసులదేముంది. అతని గురించి చాలా కథలు చెప్పుకునేవారు. రెండు మూడు హత్యలు చేశాడని చెప్పుకుంటారు. అసలు ఎవరయినా గాని రాత్రికి రాత్రి పైకి వచ్చారంటేనే అనుమానించాలి. అది కుదరని పని. ఇంకొంతమంది వున్నారు. పాతిక ముప్ఫై సంవత్సరాలు కష్టపడ్డారు. అది అందరికీ కనిపిస్తుంది. అలాంటివారిని చూస్తే అసూయ కలగదు. సరే. కొంత మందికి ఎవర్ని చూసినా కడుపు మంటగా వుంటుంది. అది ఇంకో విషయం అనుకోండి".

"మీరు చెప్పే మనిషి ఇంకా వున్నాడా?"

"లేదు. చంపేశారు".

"ఎవరు? పోలీసులా?"

"కాదు. అతని శత్రువులు".

వెంకటాద్రి ఆ మాటల్ని నిర్ఘాంతపోయి వింటున్నాడు.

"కత్తి తిప్పి బతికే వాళ్లు ఆ కత్తికే బలవుతారు అంటారు. అలాంటి వారి బతుకులు అలానే ముగుస్తాయిలే".

"ఇలాంటివి వింటే భయం కలుగుతుంటుంది వదిన గారూ... " అంది కళ్యాణి.

"మన లాంటి వారికి భయం అవసరం లేదు కళ్యాణి గారూ... మనం మన ఆదాయాన్ని బట్టి బతుకుతుంటాం. పెద్ద పెద్ద కోరికలు వుండవు. మనకి తిండికి, బట్టలకూ, వుండటానికి కాస్త చోటు వుంటే చాలు అనుకుంటున్నాం. మన పిల్లలు కూడా అంతే. ఇప్పుడు ఖర్చులు పెరుగుతున్నాయి. పిల్లలు మనకంటే కాస్త బాగుంటే చాలు. అంతే గాని మనకి పిల్లల ద్వారా కోట్లు రావాలనుకున్నా ప్రమాదమే" అంటోంది.

వెంకటాద్రి గదికి వచ్చాడు. శివలా కొన్ని మాటలు మాట్లాడుతున్నట్లుగా అనిపించింది. ఓ రకంగా మారుమూల ప్రాంతం నుండి మహా నగరాల వరకు కొంత మంది ఒకే రకంగా ఆలోచిస్తారా అనిపించింది. ఈ నగరంలో కనీసం ఈ నెలన్నర కాలంలో నాలుగయిదు హత్యలు జరిగాయని పత్రికల్లో వార్తలు వచ్చాయి. అప్పుడది తను పట్టించుకోలేదు. కేవలం వార్తగా చూశాడు. అయ్యో అని ఓ క్షణం అనిపించింది. ఇప్పుడు ఇక్కడ జరిగింది కాబట్టి, ఈ ప్రాంతంలోనే డబ్బుల మరక వుంది కాబట్టి తను ఆందోళన పడుతున్నాడు.

నాలుగు రోజులు ఈ హత్యకి చెందిన వివరాలు తెలుస్తాయని ఎదురు చూసాడు. అసలు నడక మానేశాడు. ఆఫీస్ లోనే ఎనిమిది గంటల దాకా వుండాల్సి వచ్చింది. అయిదో రోజున ఈ హత్యకి కారణం అక్రమ సంబంధం అని పోలీసులు ప్రకటించారు. అయినా అనుమానం మాత్రం సాంతం తొలగిపోలేదు.

ఆ రోజు కళ్యాణిని తీసుకువెళ్లి ఓ అపార్ట్ మెంట్ చూపించాడు. డబుల్ బెడ్ రూమ్. అయితే పన్నెండు వందల అడుగులు. ఉడ్ వర్క్ బాగా చేయించుకున్నారు ఓనర్లు. అద్దె కాస్త ఎక్కువే. మిగతా సమస్యలు లేవు. ఆఫీస్ కి మరీ దూరం కాదు. అందులోనూ అది కట్టి నాలుగు సంవత్సరాలు మాత్రమే అయింది. ఏం కావాలన్నా దొరుకుతాయి. ముందు అక్కడ సెక్యూరిటీ బాగుంది అనిపించింది. కళ్యాణికి నచ్చింది.

"ఫస్ట్ తారీఖున మనం జాయిన్ అవ్వాలి. అడ్వాన్స్ మూడు నెలలు. ఇచ్చేయనా" అన్నాడు వెంకటాద్రి. "పోర్షన్ బాగుంది. మీరు మారదాం అను కున్నారు. ఇంక ఆలస్యం ఎందుకు. నా అభిప్రాయం ఇంతకు ముందే చెప్పాను" అంది కళ్యాణి. మరో వారం రోజుల సమయం వుంది.

"ఇదేంటి. ఇంత సడన్ గా ఇల్లు మారుతున్నావు" అన్నాడు శివ.

"ఎందుకో నాకు ఇక్కడ సేఫ్టీ అనిపించలేదు. నా ప్రయాణాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. అందుకని మారిపోతున్నాం".

"నిన్ను నేను మిస్ అవుతున్నాను".

"అలా అనకు శివా. నిజానికి మిస్ అవుతున్నది నేను. నీ నుండి చాలా నేర్చుకున్నాను. నీలాంటి మిత్రుడు నాకు అక్కడ దొరకటం కష్టం".

"అలా ఎందుకు అనుకోవాలి. నాకంటే గొప్ప వ్యక్తులు, నాకంటే మంచి మనుషులు నీకు దొరకవచ్చు" అన్నాడు శివ.

"మనం వాకింగ్ లో మాట్లాడుకునే విషయాలు ఇంక ఫోన్ లో మాట్లాడుకోవచ్చు. అయినా వెంకట్ దగ్గర చిట్స్ వున్నాయి. వాటి వాయిదాలు కట్టాలి. నిన్ను చూడటానికయినా నేను వస్తుంటాను. అలాగే మా ఇంటికి నువ్వు ఎప్పుడయినా కుటుంబంతో సహా రావచ్చు. నేను ఈ కాలనీ నుండి వెళ్తున్నాను. ఈ నగరం నుండి కాదు".

"ఏమో... కొద్ది రోజుల్లో నువ్వు ఈ నగరం నుండి ఇంకో నగరానికి వెళ్లవచ్చు. రేపు ఏం జరుగుతుందో మనం చెప్పలేం కదా!"

"అది మాత్రం నిజం" అన్నాడు వెంకటాద్రి.

ఆనందరావు ఉదయమే ఇంటికి రావటంతో కళ్యాణి ఆశ్చర్యపోయింది. కనీసం ఫోన్ చేయలేదు. ఇంతకు ముందులా ఏదన్నా పని మీద, ఎవరితో నన్నా వచ్చాడా అనే సందేహం వచ్చింది. తమ్ముడి ముఖం చూస్తుంటే ఏదో జరిగింది అనిపిస్తోంది. ఓ పక్కన వెంకటాద్రితో ఉదయం నిరంజన్ మాట్లాడాడు. ఇద్దరూ కలసి చెన్నై వెళ్లాల్సి వుంటుందేమో అన్నాడు. అంతకు మించి వివరాలు తెలియవు. ఆఫీస్ కి బయలు దేరే హడావుడిలో వున్నాడు.

ఆనందరావు హాల్లో వున్నాడు. కళ్యాణి తమ్ముడు వచ్చాడని చెప్పగానే వెంకటాద్రి వచ్చి పలకరించాడు.

"అందరూ కులాసానే కదా!"

"ఓ విషయం మాట్లాడదామని వచ్చాను బావా... ఈ మధ్య చేసిన టెస్టుల్లో వనిత వాళ్ల పెద్దమ్మకి కేన్సర్ బయటపడింది".

"కేన్సరా!" అప్రయత్నంగా అంది కళ్యాణి షాకవుతూ.

"అవును".

"ఎన్నో స్టేజ్ లో వుంది?" అన్నాడు వెంకటాద్రి.

"అవన్నీ అలా వుంచితే మహా అయితే సంవత్సరం లేదా రెండు సంవత్సరాల లోపు చనిపోయే అవకాశం వుంది అంటున్నారు. ట్రీట్ మెంట్ చేయించాలి. కీమో ఇవ్వాలంటున్నారు. ఈ వయసులో ఎంత వరకు తట్టుకోగలదు అని మేం అనుకుంటున్నాం".

"అసలు ఏ ట్రీట్ మెంటూ ఇవ్వకపోతే రోజులూ, నెలలే కదా!" అంది కళ్యాణి.

"ఇవ్వకపోవటం అంటూ వుండదక్కా... ఈ విషయం గురించి మీతో మాట్లాడదామని వచ్చాను. అక్కడ ఇప్పించటమా, హైదరాబాద్ తీసుకు రావటమా అని ఆలోచించాలి. ఇక్కడయితే బాగుంటుందని కొంతమంది అంటున్నారు. మంచి హాస్పటల్స్ వున్నాయి ఇక్కడ, ఇవన్నీ ఫోన్లో ఎందుకు మీరు వెళ్లి మాట్లాడి రండి అంది వనిత".

"ఆనందరావు ఇంకో ఆప్షన్ కూడా వుంది. చెన్నైలో మంచి కేన్సర్ హాస్పటల్ వుంది. అడయార్ కి ఇంతకు ముందు చాలా మంది వెళ్తుండేవారు. నేను అర్జెంట్ గా ఆఫీస్ కి వెళ్లాలి. మీ ఇద్దరూ మాట్లాడుతుండండి. లంచ్ కి రావటం కూడా నాకు కుదరదు. రాత్రికి మాట్లాడుకుందాం".

"రాత్రికి మీరు చెన్నై వెళ్లాల్సి వస్తే...?"

"ఆఫీస్ కి వెళ్తే గాని ఏ విషయం తెలియదు. అంతగా అయితే రెండు రోజులు వుంటాడు. నేను ఫోన్ చేసి ప్రోగ్రాం వుంటే చెబుతాను".

"రెండు రోజులుండటం కుదరదు బావా. ఈ విషయం వినగానే నాకు కాళ్లూ, చేతులూ ఆడలేదు. ముందు నిన్నూ, అక్కని కలవాలనుకున్నాను".

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS